ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



**(గొరగనమూడిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 30-11-97)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

నీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. అది నశించేది కాదు. దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే జ్ఞానం. అది నీవే. అది నీవే అయినప్పటికి దానిని తెలుసుకోవటానికి గుడులు చుట్టూ తిరుగుచున్నావు, యాత్రలు చేస్తున్నావు. నీహృదయంలో ఉన్న సత్యవస్తువు గురించి నీకు తెలిస్తే నీవు సుఖపడతావు, తెలియకపోతే జన్మజన్మలకి దుఃఖం నిన్ను వెంటాడుతూ ఉంటుంది. నీహృదయంలో ఉన్న సత్యవస్తువు గురించి నీకు తెలియక పోవటం వలన, మాంసం, ఎముకలతో తయారుచేసిన ఈశరీరం మీద నీకు అహంబుద్ధి కలుగుతోంది. నీహృదయంలో ఉన్న సత్యానికి, ఈ దేహానికి ఇసుమంతయు సంబంధం లేదు. నీ దేహం మరణిస్తుంది. కాని దానికి మరణం లేదు. చైతన్యం వ్యక్తమయిన రూపంలో లోకంగా ఉంది, వ్యక్తంకాని రూపంలో ఉనికిగా ఉంది. . వ్యక్తమయ్యే దాని మీద నీకు ప్రేమ లేనప్పుడు వ్యక్తం కాని దాని మీద నీకు ప్రేమ ఉంటుంది, అని నిర్ధారణ ఎక్కడ ఉంది.

నీహృదయంలో ఉన్న సత్యముతో కలిసి ఉండటమే సత్సంగము హృదయంలో ఉన్న సత్యముతో కలిసిఉండే అర్హతలేకపోతే సత్యమును ఎవడైతే తానుగా అనుభవిస్తున్నాడో వాడితో సహవాసం చేయటం వలన ఆస్థితిని పొందటానికి వాడు నీకు సహకరిస్తాడు. తన హృదయంలో ఉన్న చైతన్యం తానుగా ఎవడికైతే వ్యక్తమవుతోందో వాడే గురువు. అటువంటి వారితో సహవాసం చేయటం వలన వారి వైబ్రేషన్స్ నీ మీద పనిచేస్తాయి, సత్యమును పొందాలి, అనే కాంక్ష నీకు కలుగుతుంది. కాంక్ష కలిగితే మార్గం అదే కనిపిస్తుంది. పనికి జ్ఞానానికి విరోధం లేదు. పనిచేయటం ద్వారా మనలోని బలహీనతలు తెలుస్తాయి. ఈరోజు జ్ఞానానంద జయంతి. ఆయనకు చిత్తశుద్ధి ఉంది, ఏకాగ్రత ఉంది. అందువలన ఆయన జ్ఞాని అయ్యాడు.మనం కూడా చిత్తశుద్ధిని, ఏకాగ్రతను సంపాదిస్తే అంతటివారము అవుతాము. దేహం మరణించినప్పుడు బంధువులతోటి, పరిసరాలతోటి సంబంధం తెగిపోతుంది. కానిగురువుతో సంబంధం తెగదు. మనం ఏగురువు ద్వారా తరించాలో అది ఈశ్వర నిర్ణయము. మనం ఆ గురువు మీద కోపంతో దూరంగా వెళ్ళిపోయినా, ఎక్కడ తిరిగినా కొన్ని జన్మల తరువాత అయినా ఆయన దగ్గరకే చేరుకొంటాము. ఉపాధులు తేడాగాని జ్ఞానం ఒక్కటే భౌతికంగా దగ్గరగా ఉండి ఒకరిని ఒకరు ద్వేషించుకోవటం కంటే భౌతికంగా దూరంగా ఉన్నా ఒకరిని ఒకరు ప్రేమించుకోవటం మంచిది, రోగకారణములు అన్ని దేహంలోని ఉన్నాయి. దేహాన్ని విడిచిపెట్టి రోగాలు లేవు. అలాగే నీలో ఎన్ని దోషములు ఉన్నా అవి నీమనస్సును, దేహబుద్ధిని

విడిచిపెట్టిలేవు. దేహబుద్ధి వలన మోహం కలుగుతుంది. మోహంవలన బేదబుద్ధి కలుగుతుంది. బేదబుద్ధి వలన అందరి హృదయాలలో ఉన్న ఈశ్వరుని దర్శించలేకపోతున్నాము. బేదబుద్ధి నశించినప్పుడు అందరి హృదయంలో ఉన్న ఈశ్వరుని దర్శించవచ్చును.

దైనందిన జీవితంలో మనం కొంత వరకు లౌక్యంగా ఉండాలి. ప్రతీ చిన్న విషయానికి లౌక్యంగా ఉంటే సత్యానికి దూరమవుతాము, ప్రతీ చిన్న విషయానికి లౌక్యంగా ఉంటే దేహాభిమానం పెరుగుతుంది, అహంభావన పెరుగుతుంది. మరణానంతరము చీకటిలోకాలు మిగులుతాయి. పనిపట్ల అంకితభావం కలిగిఉండాలి. కొంత వరకు లౌక్యంగా ఉండాలి. మనం అశాంతిగా ఉంటాము గురువు ప్రశాంతిగా ఉంటాడు. గురువు యొక్క శాంతి నుండి వచ్చే శక్తి తరంగాలు గురువు ఏ స్థితిని పొందాడో ఆస్థితిని పొందటానికి మనకు సహకరిస్తాయి. అది మనకు తెలియకపోవచ్చు. నిజమైన గురువు నీహృదయంలోనే ఉన్నాడు. ఆయనను గ్రహించే శక్తి నీకు లేనప్పుడు బాహ్యంగా గురువు నీకు అవసరము. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని గ్రహించటానికి బాహ్యగురువు నీకు సహకరిస్తాడు. ఇద్దరికి బేధం లేదు. ఆయన ఈయన ఒక్కడే, ఉన్నది ఒక్కటే వస్తువు.

## (ఉండిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 31-12-97)

**ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,**

దేవాలయం అంటే దేవుడు ఉండే ఇల్లు. కొంతమంది గుడిలో ఉన్నది రాయే కదా అంటారు. భావన ప్రధానము, దేవుడు అనే అనుకోవాలి, దైవభావన కలిగి ఉండాలి. రోజూ గుడికి వెళ్ళి ఆరూపాన్ని ధ్యానం చేసి, ఆనామాన్ని స్మరించటం వలన మనం ఆయన అనుగ్రహానికి పాత్రులవుతాము, మనకు ఇంద్రియనిగ్రహం కలుగుతుంది. అధ్యాత్మికంగా అయినా, భౌతికంగా అయినా అభివృద్ధి అవ్వటానికి ఇంద్రియనిగ్రహం అవసరం. ఇంద్రియనిగ్రహం లేకపోతే మనం ఎంత సంపాదించిన పొయ్యిలో పెట్టిన కట్టెలలాగ అవుతుంది. కొంతమంది సంపాదిస్తారు. మంచిపని ఒక్కటి కూడా చేయరు. ఇంద్రియాలను సంతృప్తి పరచటానికి ఖర్చుపెడుతూ ఉంటారు. దైవాన్ని ప్రార్థించటంవలన ఇంద్రియనిగ్రహం కలుగుతుంది. దాని వలన భౌతికంగా అభివృద్ధిలోనికి వస్తారు. అప్పుడు మీరు సంపాదించినది మీ కుటుంబానికి ఉపయోగపడుతుంది, సమాజపరంగా మంచిపనులు కూడా చేయగలుగుతారు. మంచిపనులు చేస్తే ఈలోకంలోను, పరలోకంలోను సుఖపడతారు. మంచిచేసిన వాడికి దుర్గతి లేదు అని గీతలో కృష్ణుడు చెప్పాడు. మంచిపనులు మనం చేయలేకపోయినా మంచిపనులు చేసిన వారిని గౌరవించటం వలన ఈశ్వరుడు మనకు కూడా కొంత పుణ్యాన్ని ప్రసాదిస్తాడు. పుణ్యఫలితంగా మనకు సుఖం వస్తుంది. పుణ్యఫలం సుఖం, పాప ఫలం దుఃఖం, జ్ఞాన ఫలం మోక్షం. అందువలన మంచి పనులు చేయటం ద్వారా మనం జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. అదే గమ్యంగా పెట్టుకోవాలి.

గుడిలో ఉన్న దేవుడే మన హృదయంలో చైతన్యంగా, ఆత్మగా ఉన్నాడు. గుడికి వెళ్ళి ఆ దేవుని

రూపాన్ని పూజించటం వలన, ఆ నామాన్ని స్మరించటం వలన మనహృదయంలో ఉన్న దేవుని దగ్గరకు మనస్సు మళ్లించబడుతుంది. మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచితే మనస్సులో ఉన్న సంస్కారములు, పునర్జన్మ కారణములు అన్నీ కరిగిపోతాయి. మనకు వ్యక్తి భావన ఎక్కువ. మనం పనిచేస్తే అందరూ గుర్తించాలి, అని అనుకొంటాము. అటువంటి వ్యక్తులు కోటి పూజలు చేసినా, యజ్ఞాలు చేసిన వారికి పుణ్యం వస్తుంది గాని జ్ఞానం రాదు. గుర్తింపుకావాలి అని కోరుకొంటే గుర్తింపు వస్తుంది, జ్ఞానం సున్నా. మన కోరికతో సంబంధం లేకుండా గుర్తింపు వస్తే నష్టం లేదు. జీవితగమ్యం జ్ఞానం సంపాదించాలి. ఆత్మబుద్ధి కలిగినవాడికి జ్ఞానం వస్తుందిగాని దేహబుద్ధి ఉన్న వాడికి జ్ఞానం రాదు. వ్యక్తిభావన తగ్గించుకోవాలి ఈ యజ్ఞాలు, పూజలు, జపాలు ఈ సాధనలు అన్నీ మనస్సుకే. లోపల ఉన్న చైతన్యానికి వీటితో ఏమి సంబంధం లేదు. ఇవి అన్నీ ఎందుకు చెప్పారంటే వీటివలన మనస్సు అణుగుతుంది. అణిగిన మనస్సుకు హృదయంలో ఉన్న వస్తువు తెలియబడుతుంది. హృదయంలో ఉన్న ఈశ్వరుడిని దర్శించాలి అని మీరు త్రికరణశుద్ధిగా కోరుకొంటే మీకు ఏమి కావాలో అవి అన్నీ భగవంతుడు సమకూర్చి పెడతాడు. ఇందులో సందేహించవద్దు.

అందరూ బయట ఉన్న సంసారం గొడవ చెపుతున్నారుగాని లోపల ఉన్న సంసారం గొడవ ఒక్కరూ చెప్పరేమిటి అనేవారు భగవాన్. అసలు లోపలఉన్న సంసారం బట్టి బయటఉన్న సంసారం వస్తుందిగాని బయటఉన్న సంసారాన్ని బట్టి లోపల సంసారం రావటం లేదు. అందరూ బయట సంసారం గొడవ చెపుతున్నారు. నీ దేహం పోయినపుడు ఇది అంతా పోతుంది. కాని లోపల ఉన్న సంసారం మీ కొంప ముంచుతోంది అన్నారు భగవాన్. నీమనస్సులో ఉన్న దోషములు, సుఖం, దుఃఖం, పునర్జన్మ కారణములు ఇవి అన్నీ నీ లోపల సంసారం. లోపలఉన్న సంసారమునుబట్టి నీకు దేహం వస్తోంది. దేహాన్ని బట్టి బయట సంసారం వస్తోంది. మీరు సాధన చేసి మనస్సులో ఉన్న దోషములను తొలగించుకొంటే బయట సంసారం రాదు. మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధి అవ్వాలంటే సాత్వికబుద్ధిని పెంచుకోవాలి. సాత్వికబుద్ధిని పెంచుకోవాలంటే తిండి విషయంలో, స్నేహాల విషయంలో, చదివే పుస్తకాల విషయంలో మాటల విషయంలో, నిద్ర విషయంలో, జాగ్రత్తగా ఉండాలి. మహాత్ముల సమక్షంలో ఉండటం వలన మీకు తెలియకుండా మీ మనస్సు అణుగుతుంది, రజోగుణం, తమోగుణం అణిగిపోతాయి. సాత్వికబుద్ధి కలుగుతుంది.

ఎన్ని తలంపులు వచ్చినా కంగారు పడకండి. తలంపులు నిజాలు కావు, తలంపులు శాశ్వతంకాదు. అవి వస్తూ ఉంటాయి. పోతూ ఉంటాయి. ఈ తలంపులను చూసి కంగారు పడవద్దు, ఆతలంపులతో తాదాప్యం పొందవద్దు. తలంపుల గురించి ఆలోచించేబదులు, ఆతలంపులు చుట్టూ తిరిగే బదులు మీరు ఏది అయితే అవునో దానిని స్మరించటం వలన దానిని తొందరగా పొందుతాము. ఏ ఆత్మ అయితే మీరో దానిని నమ్మటం వలన, దాని మీద ధృఢమైన విశ్వాసం ఉండటం వలన మనస్సు వెళ్లి అక్కడ నిలబడుతుంది. అప్పడు మీ మనస్సు నశిస్తుంది. అప్పడు తలంపులు వచ్చినా నిన్ను బంధించవు. జ్ఞానికి తలంపులు వస్తాయి. అవి వ్యక్తిపరంగా, అహంకారపరంగా ఉండవు. అందువలన

ఆ తలంపులు వాడిని బంధించవు.

గురువు సమక్షంలో మీకు అనుభవం కలుగుతుంది. మీ హృదయంలో ఉన్న వస్తువు మీకు తెలుస్తుంది. మీ హృదయంలో ఉన్న వస్తువు మీకు తెలిసినప్పటికి మీ వాసనలు, కోరికలు, తలంపులు అక్కడ ఉండనివ్వవు. మీ అనుభవం శాశ్వతంకాదు. మనస్సు హృదయంలో మునగాలి. తేలిక మనుషులు మునగ లేరు. మనస్సుకు తూకం పెరగాలి. తోటిమానవుడిని ప్రేమిస్తే, భగవంతుని స్మరిస్తే, మిమ్మల్ని మీరు మర్చిపోయి ఎదుటివారికి చేతనయినంత సహాయం చేస్తూ ఉంటే మీ మనస్సుకు తూకం పెరుగుతుంది. అప్పుడు మీ మనస్సు హృదయంలో మునుగుతుంది. మనం చేయగలిగినంత చేస్తూ ఉంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. ఈశ్వరానుగ్రహం లేకుండా ఈశ్వరునికి సంబంధించిన జ్ఞానమును పొందలేము. లోపల ఉన్న సద్వస్తువు నుండి వేరుపడిపోయి మనం అహంకారంతో కలిసి ఉన్నాము. అదే మన దుఃఖానికి కారణం. ప్రపంచంలో మంచీ ఉంటుంది, చెడూ ఉంటుంది మనం ఏమి చెయాలి అంటే మంచిని చూస్తూ, మంచిని వింటూ, మంచిని మాట్లాడుతూ ఉంటే ఆ మంచే మనం అయిపోతాము. అప్పుడు మనకు జ్ఞానం కలుగుతుంది. మనం సమాజానికి మంచిని ఇవ్వాలి గాని చెడ్డను ఇవ్వకూడదు. మనస్సు యొక్క మూలంలోనే భగవంతుడు ఉన్నాడు. మనస్సులో ఉన్న దోషాల వలన అది లోపలకు వెళ్ళమంటే వెళ్ళదు. మనస్సును అంతర్ముఖం చేయటం కష్టం. నీ అంతట నీవు మనస్సును లోపలకు పంపలేవు. మనస్సును అంతర్ముఖం చేయటం కోసం గురువు అనుగ్రహం అవసరం.

వాసనకు అనుగుణంగా మీకు ఒక శరీరం వస్తుంది. శరీరం వచ్చినా ఫరవా లేదు. ఆ శరీరానికి నేను అనే బుద్ధి కలుగుతుంది. అక్కడే ప్రమాదం. దేహం నేనుకాకపోయినా ఈ దేహం నేను అనే బుద్ధి కలుగుతుంది. అదే మాయ మాయ కనుక లేకపోతే మనకు కర్మానుభవం కలుగదు. దేహబుద్ధి దాటిపోతే వాడిని కర్మ ఏమీ చేయలేదు. అంతా మాయ అని చెపుతున్నారు. మరి ఈ ఆశ్రమాలు, మీరు నేను మాట్లాడుకోవటం, ఈ సమావేశాలు ఇవి అన్నీ కూడా మాయే కదా అని ఆచార్యుల వారిని అడిగారు. మనకు స్వప్నంలో ఒక పులి వచ్చింది అనుకోండి. దానిని చూసి భయంవేసి మెలుకువ వచ్చేస్తుంది. స్వప్నంలో వచ్చిన పులి అబద్ధం అయినప్పటికి నీకు మెలుకువరావటానికి అది ఉపయోగపడింది. అలాగే ఈసత్సంగాలు, ఆశ్రమాలు ఇవి అన్నీ అబద్ధం అయినప్పటికీ చైతన్యంలోనికి నిన్ను మేల్కొలపటానికి సహకరిస్తాయి, అని ఆచార్యుల వారు చెప్పారు. మీరు గీత చదివి, పెద్దల మాటలు విని వాటిని నేర్చుకోవటానికి ప్రయత్నం చేస్తారు. మీ మనస్సుకు పూర్వపు వాసనలు, అలవాట్లు ఉంటాయి. మా మాట ఏమిటి అని అవి వచ్చి నిన్ను ఎటాక్ చేస్తాయి. అప్పుడు తట్టుకోలేకపోతే మీరు పతనమవుతారు. అప్పుడు గురువు అనుగ్రహం అవసరం. చిన్న నిప్పరవ్వ చాలు పెద్ద గడ్డిమేటు అంటుకోవటానికి అలాగే చిన్న బలహీనత చాలు మనం పతనం అవ్వటానికి. మీ సాధన వలన పోగొట్టుకోలేని వాసనలు మీలోపల ఉంటాయి. ఏ వాసనను అయితే తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తున్నావో దానికి నీబలం చాలదు అనుకొన్నప్పుడు గురువు కూడా ఒక చెయ్యివేసి దానిని బయటకు గెంటుతాడు.